క్లుప్తంగా

మౌలిక వసతుల కల్పనకు కృషి
పేర్ని కిట్టు

మచిలీపట్నంటౌన్: నగరంలోని పలు కాలనీల్లో మౌలిక వసతుల కల్పనకు ప్రత్యేక కృషి చేస్తున్నామని వైఎస్సార్ సీపీ యువజన విభాగం జోనల్ ఇన్‌చార్జి పేర్ని కృష్ణమూర్తి (కిట్టు) అన్నారు. 27వ డివిజన్‌లో మంగళవారం మేయర్ చిటికిన వెంకటేశ్వరమ్మతో కలిసి గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. డివిజన్ ఇన్‌చార్జ్ షేక్ అచ్చెబాతో కలిసి డివిజన్‌లోని పలు ప్రాంతాల్లో పర్యటించి ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. డ్రెయిన్లు, రహదారుల సమస్యలను ప్రజలు వీరి దృష్టికి తీసుకువచ్చారు. పేర్ని కిట్టు మాట్లాడుతూ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని వివరించారు.

తరగతులు నిర్వహిస్తే కఠిన చర్యలు

కోడూరు: దసరా సెలవుల్లో నిబంధనలకు విరుద్ధంగా పాఠశాలలను తెరిచి విద్యార్థులకు తరగతులు నిర్వహిస్తే కఠిన చర్యలు తప్పవని ఎంఈఓ టీవీఎం రామదాసు హెచ్చరించారు. మంగళవారం మండలంలోని పలు ప్రైవేటు పాఠశాలలను ఎంఈఓ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ప్రైవేటు పాఠశాలల్లో 8,9,10 తరగతుల విద్యార్థులకు తరగతులు నిర్వహిస్తున్నట్లు తమకు సమాచారం అందిందని, దీంతో తనిఖీలు చేశామని ఎంఈఓ చెప్పారు. తరగతులు నిర్వహిస్తే నేరుగా ఎమ్మార్సీలో ఫిర్యాదు చేయవచ్చని ఎంఈఓ తెలిపారు.

శ్మశానం వద్ద పారిశుద్ధ్య పనులు

మచిలీపట్నంటౌన్: నగరంలోని చల్లపల్లి బైపాస్‌రోడ్డులో హిందూ శ్మశాన వాటిక వద్ద మంగళవారం ప్రత్యేక పారిశుద్ధ్య పనులు నిర్వహించారు. నగరంలోని వివిధ ప్రాంతాలకు చెందిన వారు గృహ నిర్మాణాలు చేపట్టిన సందర్భంలో వచ్చే వ్యర్థాలను తీసుకువచ్చి శ్మశానం వెంబడి రోడ్డు మార్జిన్‌లో వేస్తున్నారు. ఈ వ్యర్థాలు గుట్టలుగా తయారయ్యాయి. మేయర్ చిటికిన వెంకటేశ్వరమ్మ ఇటీవల ఆ ప్రాంతంలో పర్యటించిన సందర్భంలో వీటిని చదును చేయాలని సూచించారు. దీంతో జేసీబీ సాయంతో ఆ ప్రాంతంలోని మట్టి దిబ్బలను చదును చేశారు. అలాగే 46వ డివిజన్‌లో మట్టిదిబ్బల చదును పనులు నిర్వహించారు. పనులను కార్పొరేటర్ భోగాది సాయిబాబు, కో–ఆప్షన్ సభ్యుడు బేతపూడి రవి పర్యవేక్షించారు.

దేవస్థానానికి క్యాష్ కౌంటింగ్ మిషన్ల వితరణ

మోపిదేవి(అవనిగడ్డ): మోపిదేవి వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి వారి దేవస్థానానికి మంగళగిరికి చెందిన చైతన్య గోదావరి గ్రామీణ బ్యాంకు మేనేజర్ శేషగిరిరావు రెండు క్యాష్ కౌంటింగ్ మిషన్లను అందజేశారు. మంగళవారం ఉదయం ఆలయానికి చేరుకున్న ఆయన స్వామివారి దర్శించుకున్నారు. అనంతరం రూ.64 వేలు విలువగల రెండు కౌంటింగ్ మిషన్లను ఆలయ సూపరింటెండెంట్ బొప్పన సత్యనారాయణకు అందించారు. బ్యాంకు సిబ్బంది, ఆలయ అధికారులు పాల్గొన్నారు.

బంగారు మంగళసూత్రాల సమర్పణ..

వల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయంలో అమ్మవార్లకు భక్తులు మంగళవారం బంగారు మంగళ సూత్రాలు సమర్పించారు. తూర్పు గోదావరి జిల్లా పాశర్లపూడి గ్రామస్తులు పలసలపూడి తాతారావు మంగళవారం అమ్మవార్లకు బంగారు మంగళ సూత్రాలను ఆలయ ఏసీ ఎస్ఎస్ చక్రధరరావుకు అందజేశారు. ఆలయ అర్చకులు స్వామివార్లకు పూజలు నిర్వహించి ఆలయ మర్యాదలతో దాతను సత్కరించారు.

జగనన్న కాలనీ నిర్మాణాల పరిశీలన

మచిలీపట్నంటౌన్: రుద్రవరంలోని జగనన్న కాలనీలో నూతనంగా నిర్మిస్తున్న గృహాలను మంగళవారం మేయర్ చిటికిన వెంకటేశ్వరమ్మ పరిశీలించారు. వర్రెగూడెంలోని అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్‌లో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరాన్ని ఆమె పరిశీలించారు. ఆమె మాట్లాడుతూ లబ్ధిదారులు యుద్ధప్రాతిపదికన ఈ ప్రాంతంలో గృహ నిర్మాణాలు చేపట్టాలన్నారు. కార్పొరేటర్ మిరియాల బసవపూర్ణమ్మ, కో–ఆప్షన్ సభ్యురాలు మట్టా తులసి, నాయకురాలు చింతా మౌనిక పాల్గొన్నారు.

సామూహిక ఎలుకల నిర్మూలన చేపట్టాలి

పెదకళ్లేపల్లి(మోపిదేవి): సమీపంలోని రైతులంతా సామూహిక ఎలుకల నిర్మూలన చేపట్టి పంటను కాపాడుకోవాలని అవనిగడ్డ వ్యవసాయ సంచాలకులు జీఎస్ జయప్రద అన్నారు. పెదకళ్లేపల్లిలో మంగళవారం సామూహిక ఎలుకల నిర్మూలనపై రైతులకు అవగాహన కల్పించారు. ఎలుకల నిర్మూలన బ్రోమోడైలోన్ మందును ప్రభుత్వం నూరు శాతం రాయితీపై రైతు భరోసా కేంద్రం వద్ద రైతులకు అందిస్తోందని చెప్పారు. పెదకళ్లేపల్లి సచివాలయం 1 వద్ద ఎలుకల మందు వినియోగం, పిచికారీపై అవగాహన కల్పించారు. మండల వ్యవసాయాధికారి హెప్సిబారాణి, వీఏఏలు, స్థానిక రైతులు పాల్గొన్నారు.

నిత్యావసరాలు పంపిణీ


చల్లపల్లి: ఐవీఎం సురేష్ సేవలు ప్రశంసనీయమని ఎంపీడీఓ చేకు చిన రాట్నాలు అన్నారు. మంగళవారం స్థానిక కోమలానగర్, నారాయణరావు నగర్‌లోని రెండు మురికివాడల్లో 75 నిరుపేద ఎస్టీ కుటుంబాల వారికి పురిటిగడ్డకు చెందిన ఇండియా విలేజ్ మినిస్ట్రీస్ స్వచ్ఛంద సేవా సంస్థ డైరెక్టర్ డాక్టర్ వేములపల్లి సురేష్ ఆధ్వర్యంలో రూ.1,12, 500ల విలువైన నిత్యావసర సరుకులు అందజేశారు.

అన్నపూర్ణే.. సదాపూర్ణే..

- మూడో రోజుకు చేరిన నవరాత్రి ఉత్సవాలు
- అన్నపూర్ణాదేవిగా అమ్మవార్ల దర్శనం
- విశేష పూజలు, అలంకరణలు


అన్నపూర్ణాదేవిగా కోడూరు కనకదుర్గమ్మ అమ్మవారు


గూడూరులో అన్నపూర్ణాదేవి అలంకారంలో అమ్మవారు


పెడనలో అన్నపూర్ణాదేవి అలంకరణలో పైడమ్మ అమ్మవారు


అన్నపూర్ణాదేవిగా నరసింహపురంలోని దుర్గమ్మ అమ్మవారు


పాశ్చాపురంలో అన్నపూర్ణా దేవిగా అమ్మవారు


కృత్తివెన్ను శివాలయంలో లలితాదేవిగా అమ్మవారు

నాగాయలంక: అవనిగడ్డ, పెడన, మచిలీపట్నం నియోజకవర్గాల్లో దసరా శరన్నవరాత్రి ఉత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. ఉత్సవాలు మంగళవారం మూడో రోజుకు చేరాయి. మంగళవారం అమ్మవార్లు అన్నపూర్ణాదేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయాలు, కూడళ్లల్లో జరుగుతున్న ఉత్సవాల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని పూజలు చేసి తీర్థప్రసాదాలు స్వీకరించారు. నాగాయలంక కృష్ణాతీరంలోని కనకదుర్గమ్మ దేవస్థానంలో అమ్మవారు అన్నపూర్ణాదేవి అలంకారంలో భక్తులకు దర్శనం ఇచ్చారు. అమ్మవారికి విశేష పూజ, హోమం జరిపి మంత్రపుష్ప నీరాజనం సమర్పించారు. నాగాయలంక పార్వతీ సమేత కన్యకా పరమేశ్వరీ సమన్విత నగరేశ్వరస్వామి వారి దేవస్థానంలో పార్వతీదేవిని అన్నపూర్ణాదేవిగా, వాసవీ కన్యకా పరమేశ్వరిని మహాలక్ష్మీదేవిగా అలంకరించారు. గణపేశ్వరం దుర్గా, గణపేశ్వరస్వామి ఆలయాలలో నిలువెత్తు కనకదుర్గమ్మ గాయత్రీదేవి అలంకారంలో దర్శనమిచ్చారు. భావదేవరపల్లిలో అన్నపూర్ణాదేవి సమేత కాశీ విశ్వేశ్వరస్వామి ఆలయంలో, గ్రామ దేవత అంకాల దేవర దేవస్థానంలో అమ్మవార్లను అన్నపూర్ణాదేవిగా అలంకరించి పూజలు చేశారు.

నాగాయలంక: స్థానిక కన్యకా పరమేశ్వరీ సమన్విత పార్వతీ సమేత నగరేశ్వర స్వామి దేవస్థానం యాగశాలలో మంగళవారం అన్నపూర్ణాదేవి హోమం జరిగింది. ఆలయ అర్చకుడు కొల్లిపర సుబ్బారావు బ్రహ్మత్వంలో ప్రముఖ కిరాణా మర్చంట్ మునగాల కుటుంబరావు, తేజశ్రీ దంపతులు హోమం, పూజలలో పీటలపై కూర్చున్నారు. తొలుత శ్రీచక్ర కలశ పీఠం వద్ద శ్రీదేవి సహస్రనామ కుంకుమార్చన, అష్టోత్తర శతనామార్చన పూజలు జరిగాయి. స్థానిక సంకర్షణ భజన మండలి సభ్యులు చిట్టా వాణి నేతృత్వంలో శ్రీలలితా శ్రీలక్ష్మీ సహస్ర నామ సామూహిక పారాయణం జరిగింది. ఈ సందర్భంగా భక్తులకు అన్నసమారాధన నిర్వహించారు. ఆలయ అభివృద్ధి కమిటీ చైర్మన్ చిట్టా సాంబశివరావు, చిట్టా వీర అన్నపూర్ణయ్య, దేసు సత్యనారాయణ, చిట్టా వెంకట పూర్ణ చంద్రరావు, తాడికొండ సత్యనారాయణ, ఆర్యవైశ్య ప్రముఖులు పాల్గొన్నారు.

అన్నపూర్ణాదేవి హోమం

పెడన: పైడమ్మ అమ్మవారి దేవస్థానంలో అమ్మవారిని అన్నపూర్ణాదేవిగా అలంకరించారు. వేముల నాగమల్లేశ్వరరావు, గంగా సూర్యప్రభావతి దంపతులచే పూజాదికాలు నిర్వహించారు. కన్యకా పరమేశ్వరి దేవస్థానంలో అమ్మవారు అన్నపూర్ణాదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. అన్నపూర్ణాదేవి హోమం, సామూహిక కుంకుమార్చనలు, సాయంత్రం లలితా పారాయణం, ప్రదోషకాల పూజ, తమలపాకులు, తెల్ల కలువలు, ఎర్ర కలువలచే పూజా కార్యక్రమాలు నిర్వహించారు. రాత్రి పెడన శ్రీవాసవీ మహిళా మండలి వారిచే భక్తిపాటలు, కోలాట ప్రదర్శన భక్తులను ఆకట్టుకున్నాయి.

ఆకట్టుకున్న అమ్మవార్ల అలంకరణ

కోడూరు: కోడూరు గంగాభవానీ అమ్మవారు గాయత్రీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం అమ్మవారికి సామూహిక కుంకుమార్చన నిర్వహించారు. సంతమార్కెట్ సమీపంలోని కనకదుర్గమ్మ అమ్మవారిని అన్నపూర్ణాదేవిగా అలంకరించారు. నరసింహపురంలోని రామాలయం వద్ద ఏర్పాటు చేసిన దుర్గమ్మ విగ్రహానికి, లింగారెడ్డిపాలెంలోని బాలాత్రిపుర సుందరీ దేవి, విశ్వనాథపల్లి, మందపాకల అద్దంకి నాంచారమ్మ, కోడూరు దానాశక్తి, పార్వతి అమ్మవార్ల అలంకారాలు విశేషంగా ఆకట్టుకున్నాయి.

- కృత్తివెన్ను: దేవీ నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకుని మండల పరిధిలోని పలు గ్రామాల్లో అమ్మవార్లు విశేష అలంకారాల్లో పూజలందుకున్నారు. మంగళవారం కృత్తివెన్ను శివాలయంలో లలితాదేవిగాను, గరిశపూడి ఇష్టకామేశ్వరీ ఆలయంలో గాయత్రీదేవిగాను అమ్మవార్లు భక్తులకు దర్శనమిచ్చారు. కుంకుమార్చనలు, విశేష పూజలు నిర్వహించారు.
- గూడూరు: గూడూరులోని రామలింగేశ్వరస్వామి ఆలయంలో అమ్మ వారు పరాశక్తి రూపంలో దర్శనమిచ్చారు. మహాలక్ష్మి అమ్మవారి ఆలయంలో గాయత్రీదేవిగాను, యాదవుల బజారులో కాశీ అన్నపూర్ణాదేవిగాను దర్శనమిచ్చారు. ఐదుగుళ్ల పల్లిలోని శివాలయంలో గాయత్రీ దేవి అలంకారంలో ఉన్న అమ్మవారిని భక్తులు దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు.

ధనలక్ష్మీగా అమ్మవారి దర్శనం..

చల్లపల్లి: స్థానిక జమ్మిలంక అంకమ్మ తల్లి అమ్మవారు మంగళవారం ధనలక్ష్మీ దేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. వేద పండితులు అమ్మవారికి విశేష పూజలు, కుంకుమ పూజలు నిర్వహించారు. నడకుదురులోని పృధ్వీశ్వరస్వామి దేవస్థానంలో దేవదాయ శాఖ ఆధ్వర్యంలో అమ్మవారికి విశేష అలంకరణ, పంచామృత అభిషేకం, రుద్రాభిషేకం, సామూహిక కుంకుమ పూజలు నిర్వహించారు. చల్లపల్లిలోని కన్యకా పరమేశ్వరి ఆలయంలో అమ్మవారిని అన్నపూర్ణాదేవిగా అలంకరించి పూజలు చేశారు.


పెడన కన్యకా పరమేశ్వరీ దేవి ఆలయంలో సామూహిక కుంకుమార్చన


అన్నపూర్ణాదేవి హోమం చేస్తున్న దంపతులు


అన్నపూర్ణాదేవి అలంకారంలో నాగాయలంకలోని కనకదుర్గమ్మ


నాగాయలంక నగరేశ్వరుని సన్నిధిలో అన్నపూర్ణాదేవి అలంకారంలో పార్వతీదేవి

సామూహిక కుంకుమ పూజలు..

బంటుమిల్లి: పెదతుమ్మిడి గంగాపార్వతి సమేత అగస్త్యేశ్వరస్వామి, బంటుమిల్లి కనకదుర్గ ఆలయంలో అమ్మవారిని గాయత్రీదేవీగాను, పాశ్చాపురం గ్రామంలోని సువర్చలాంజనేయస్వామి ఆలయంలో అమ్మవారిని అన్నపూర్ణాదేవిగా, బంటుమిల్లి పద్మావతి, గోదా సమేత వెంకటేశ్వరస్వామి ఆలయంలో అమ్మవారిని ధనలక్ష్మీదేవిగా, సీతారామచంద్రస్వామి ఆలయంలో అమ్మవారిని ధైర్యలక్ష్మీదేవీగా అలంకరించి సామూహిక కుంకుమ పూజలు నిర్వహించారు. మల్లంపూడి, ముంజులూరు, పెదతుమ్మిడి, చోరంపూడి, జానకీరామపురం తదితర గ్రామాల్లో అమ్మవారి ప్రతిమలను నిలిపి అలంకారాలతో భక్తులచే సామూహిక కుంకుమ పూజలు నిర్వహించారు.

వైభవంగా ఉత్సవాలు


కన్యకాపరమేశ్వరి ఆలయంలో అన్నపూర్ణాదేవిగా అమ్మవారు


దత్తాశ్రమంలో కూచిపూడి నృత్యం చేస్తున్న పూర్ణచంద్రిక

మచిలీపట్నంటౌన్: దేవి శరన్నవరాత్రి ఉత్సవాలు నగరంలో వైభవంగా జరుగుతున్నాయి. మూడో రోజు మంగళవారం పలు ఆలయాల్లో అమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. బుట్టాయిపేటలోని దత్తాశ్రమంలో అమ్మవారు గాయత్రీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. పంచముఖాలతో చంద్రవంక కలిగిన ఆభరణాలు అలంకృతమై దర్శనమిచ్చారు. దత్తాశ్రమంలో మాజేటి లక్ష్మీకాంతం బృందం చేసిన కోలాట భజన ఆకట్టుకుంది. రాబర్ట్‌సన్‌పేటలోని రామలింగేశ్వర స్వామి ఆలయంలో రాజరాజేశ్వరి అమ్మవారికి పూజలు చేశారు. ఉదయం, సాయంత్రం కుంకుమార్చనలు జరిగాయి. ఆజాద్‌రోడ్డులోని కన్యకా పరమేశ్వరి ఆలయంలో పార్వతిదేవి అమ్మవారు అన్నపూర్ణాదేవిగా, కన్యకా పరమేశ్వరి అమ్మవారు ధాన్యలక్ష్మీ దేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. బాలా త్రిపుర సుందరి నృత్య కళానికేతన్ వారి ఆధ్వర్యంలో చేసిన నాట్య తరంగిణి కార్యక్రమం భక్తులను ఆకట్టుకుంది. అష్టలక్ష్మీపూజ వైభవంగా నిర్వహించారు. ఆర్యవైశ్య సంఘ మహిళా విభాగం సభ్యులు లలితా సహస్రనామ పారాయణం చేశారు. ఆజాద్‌రోడ్డులోని గీతామందిరంలో వాసవీ కన్యకాపరమేశ్వరి అమ్మవారు అన్నపూర్ణాదేవిగా, లలితా అమ్మవారు విజయలక్ష్మీదేవిగా దర్శనమిచ్చారు. కుంకుమ పూజల్లో మహిళలు పాల్గొన్నారు. నగరంలోని ఈడేపల్లి శక్తిగుడి, రాజుపేట ముత్యంగుడి, బెల్లంకొట్ల వీధిలోని మహాలక్ష్మీదేవి ఆలయం, ప్రధాన రహదారిలోని విజయ దుర్గాదేవి ఆలయం తదితర ఆలయాల్లో అమ్మవార్లకు పూజలు నిర్వహించారు.

రూపాయి ఖర్చు లేకుండా సంపూర్ణ వైద్యం


కంటి శిబిరాన్ని పరిశీలించి సూచనలిస్తున్న మంత్రి జోగి రమేష్


నాగాయలంక శిబిరంలో రోగులకు మందులు అందించిన ఎమ్మెల్యే సింహాద్రి

బంటుమిల్లి: వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో రూపాయి ఖర్చు లేకుండా పేదలందరికీ సంపూర్ణ వైద్య సేవలు అందుతున్నాయని రాష్ట్ర గృహ నిర్మాణ శాఖమంత్రి జోగి రమేష్ అన్నారు. నాగేశ్వరరావుపేట ప్రాథమిక పాఠశాలలో మంగళవారం ఏర్పాటు చేసిన జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాన్ని మంత్రి జోగి రమేష్ ప్రారంభించి మాట్లాడారు. జగనన్న ఆరోగ్య శిబిరాల ద్వారా పేదల ఆరోగ్యం కోసం రూపాయి ఖర్చు లేకుండా ఇంటివద్దకే వైద్య సేవలు అందిస్తున్నది ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఒక్కరే అని అన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ తాతా మహాలక్ష్మీరాజ, ఎంపీపీ వి. చిన బాబు, జెడ్పీటీసీ ఎం. వెంకటరమణ, అగ్నికుల క్షత్రియ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ టి. శ్రీనివాస రావు, ఎంపీటీసీ ఎం. తిరుపతమ్మ, ప్రజాప్రతినిధులు అధికారులు పాల్గొన్నారు.

రూ. 27 లక్షలతో త్రీఫేస్ లైన్‌కు శంకుస్థాపన

మండల పరిధిలోని రామవరపుమోడి గ్రామం జగనన్న కాలనీకి మంజూరైన త్రీఫేస్ విద్యుత్ లైన్‌కు మంత్రి జోగి రమేష్ శంకుస్థాపన చేశారు. మంత్రి మాట్లాడుతూ జగనన్న కాలనీలకు మౌలిక సౌకర్యాల కల్పనకు ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. త్రీఫేస్ విద్యుత్ ఏర్పాటుతో గ్రామంలో లో ఓల్టేజీ సమస్య పరిష్కారం అవుతుందని గ్రామస్తులు ఆనందం వ్యక్తంచేస్తున్నారు. కార్యక్రమంలో సర్పంచ్ కనకదుర్గ, వై. శివ, నాయకులు పాల్గొన్నారు.

ఇంటింటికీ మెరుగైన వైద్య సేవలు

నాగాయలంక: జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాలతో ఇంటింటికీ మెరుగైన వైద్య సేవలు అందాయని అవనిగడ్డ ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు అన్నారు. నాగాయలంక పంచాయతీ కార్యాలయం ఆవరణలో మంగళవారం మండల స్థాయి సురక్ష శిబిరం తొలి షెడ్యూల్ ముగింపు కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. జగనన్న పాలనలో జరుగుతున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలతో తమకు పుట్టగతులు ఉండవనే భయాందోళనతో ప్రతిపక్షాల నేతలు వైఎస్సార్ సీపీ ప్రభుత్వంపై ఆరోపణలు చేస్తున్నారని విమర్శించారు. ప్రజలు అన్నీ గమనిస్తున్నారని, రానున్న ఎన్నికల్లో ఎన్నికల్లో వారికి తగిన గుణపాఠం చెబుతారని హెచ్చరించారు. శిబిరంలో 950 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు. ఎంపీపీ భోగాది రాఘవరాణి, ఎంపీడీఓ సీహెచ్ శ్రీనివాస్, జెడ్పీటీసీ మోకా బుచ్చిబాబు, ఏఎంసీ చైర్మన్ కొక్కిలిగడ్డ వెంకటేశ్వరరావు, కాపు కార్పొరేషన్ డైరెక్టర్ మద్ది చిన్నారి, మండల కన్వీనర్ భోగాది శేషగిరిరావు, పీఏసీఎస్ చైర్మన్‌లు, కన్వీనర్ వెంకట్రాజు, సర్పంచ్ మోకమ్మ, ఎంపీడీఓ పిచ్చిబాబు, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

కమలాపురంలో..

పెడన: పెడన మండలం కమలాపురం గ్రామంలో ఏర్పాటు చేసిన జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరంలో 677 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. శిబిరాన్ని ఎంపీపీ రాజులపాటి వాణి, వైస్ ఎంపీపీ యాదంరెడ్డి వరప్రసాద్ ప్రారంభించారు. కార్యక్రమంలో సర్పంచు గుడిశేవ శ్రీనివాస రావు, మాజీ ఎంపీపీ అచ్యుతరావు పాల్గొన్నారు.

585 మందికి వైద్య పరీక్షలు..

కోడూరు: కోడూరులో నిర్వహించిన శిబిరంలో 585 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు. శిబిరాన్ని జెడ్పీటీసీ యాదవరెడ్డి వెంకటసత్యనారాయణ, ఎంపీపీ కొండవీటి వెంకటకుమారి, సర్పంచి వెన్నా షైనీలు ప్రారంభించారు. వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ పరిశె మాధవరావు, జిల్లా రైతు విభాగం కార్యదర్శి కొండవీటి నారాయణరావు, ఎంపీటీసీలు బడే గంగాధరరావు, తిమ్మన నాంచారయ్య, అధికారులు పాల్గొన్నారు.

- గూడూరు: రాయవరం శిబిరంలో 618 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. మల్లవోలు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి టి.మాధురి ఆధ్వర్యంలో మచిలీపట్నం ప్రభుత్వ ఆస్పత్రి, గూడూరు సామాజిక ఆరోగ్య కేంద్రాలకు చెందిన వైద్య నిపుణులు వైద్య సేవలు అందించారు. గూడూరు ఎంపీపీ సంగా మధుసూదనరావు శిబిరాన్ని ప్రారంభించగా సర్పంచి నందం మల్లీశ్వరి, పీఏసీఎస్ చైర్మన్ కోళ్ల బాలకృష్ణ, ఎంపీటీసీ నందం రాజేశ్వరి, వైఎస్సార్ సీపీ నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

ఇంతేరులో..

కృత్తివెన్ను: మండల పరిధిలోని ఇంతేరులో మంగళవారం జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరం నిర్వహించారు. ఎంపీపీ గరుడప్రసాద్, ఏఎంసీ చైర్మన్ గంగాధర్ శిబిరాన్ని పరిశీలించి రోగులతో మాట్లాడారు. వైద్యురాలు లావణ్య ఆధ్వర్యంలో సిబ్బంది రోగులకు వైద్యపరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు. వైఎస్సార్ సీపీ మండల నాయకులు పాల్గొన్నారు.

మంగళాపురం(చల్లపల్లి): స్థానిక జిల్లా పరిషత్ హైస్కూల్‌లో సర్పంచ్ డొక్కు నాగేశ్వరరావు ఆధ్వర్యంలో ఆరోగ్య సురక్ష శిబిరం నిర్వహించారు. వైద్యులు, సిబ్బంది 458 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందచేశారు. అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

మచిలీపట్టణాన్ని సుందరంగా తీర్చిదిద్దండి

కలెక్టర్ రాజాబాబు ఆదేశం


మాట్లాడుతున్న కలెక్టర్ రాజాబాబు. చిత్రంలో మేయర్ వెంకటేశ్వరమ్మ

చిలకలపూడి(మచిలీపట్నం): మచిలీపట్నం నగరాన్ని సుందరంగా తీర్చిదిద్దేందుకు తగిన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ రాజాబాబు అధికారులను ఆదేశించారు. మంగళవారం ఆయన చాంబర్‌లో మేయర్ చిటికిన వెంకటేశ్వరమ్మతో కలిసి మునిసిపల్, ఎంయూడీఏ అధికారులతో సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ మచిలీపట్నం అభివృద్ధిపై అధికారులు ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు. నగరంలో మైక్ ద్వారా ప్రచారం నిర్వహించి పశువుల సంచారాన్ని నియంత్రించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం ప్రత్యేక డ్రైవ్ చేపట్టి రోడ్లపై సంచరించే పశువులను ఎంపిక చేసిన ప్రాంతాలకు తరలించాలని చెప్పారు. మచిలీపట్నానికి త్వరలో ఓడరేవు రాబోతోందన్నారు. కృష్ణా విశ్వవిద్యాలయం, వైద్యకళాశాల ఇప్పటికే ఏర్పడిన నేపథ్యంలో వివిధ ప్రాంతాల నుంచి వచ్చే పలు రకాల పరిశ్రమలు గోడౌన్లు నెలకొల్పుతున్నారని చెప్పారు. పట్టణ ప్రణాళికా విభాగం అధికారులు ప్రధాన కూడళ్లను విద్యుత్ దీపాలతో సుందరంగా తీర్చిదిద్దాలన్నారు. ప్రధాన రహదారిలో ఆక్రమణలు తొలగించాలని చెప్పారు. జాతీయ రహదారి నుంచి మచిలీపట్నంలోకి వచ్చేటప్పుడు నగరంలోకి ప్రవేశిస్తున్నామని చక్కటి అనుభూతి కలిగేలా స్వాగత తోరణాలు, మొక్కల పెంపకం చేయాలని సూచించారు. మూడు స్తంభాల సెంటర్ నుంచి బైపాస్ రహదారి మీదుగా లక్ష్మీటాకీస్ సెంటర్ వరకు ఉన్న రహదారులను ముందుగా సుందరంగా తీర్చిదిద్దాలన్నారు. కోనేరు సెంటర్ నుంచి మూడు స్తంభాల సెంటర్ వరకు డివైడర్‌తో రహదారిని, విద్యుత్ దీపాలతో నిర్మాణం చేయాలన్నారు. మూడు ముఖ్యమైన ప్రదేశాల్లో నగర పాలక సంస్థ ఆధ్వర్యంలో మరుగుదొడ్లను ఏర్పాటు చేయాలన్నారు. మేయర్ చిటికిన వెంకటేశ్వరమ్మ మాట్లాడుతూ నగరాన్ని అన్ని విధాలా సుందరంగా తీర్చిదిద్దేందుకు తనవంతు సహాయ సహకారాలు అందిస్తానని తెలిపారు. సమావేశంలో బందరు ఆర్డీఓ శివనారాయణరెడ్డి, ఎంయూడీఏ వీసీ కె. రాజ్యలక్ష్మి, మునిసిపల్ కమిషనర్ జి. చంద్రయ్య, మునిసిపల్ ఎంఈ పి. శ్రీకాంత్, మాజీ కౌన్సిలర్ శీలం మారుతీరావు (బాబ్జీ) తదితరులు పాల్గొన్నారు.

దేశం గర్వించేలా జగన్ పాలన

మంత్రి జోగి రమేష్


15వ వార్డులో ప్రభుత్వ పథకాలను వివరిస్తున్న మంత్రి జోగి రమేష్

పెడన: దేశం గర్వించేలా ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి పాలన చేస్తున్నారని, ప్రజా సంక్షేమ పాలన బాగుండటంతో ఇతర రాష్ట్రాలకు చెందిన ప్రజాప్రతినిధులు సైతం ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం వైపు చూస్తున్నారని రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ మంత్రి జోగి రమేష్ అన్నారు. మంగళవారం మంత్రి జోగి రమేష్, మంత్రి తనయుడు జోగి రాజీవ్‌లు పట్టణంలోని 13, 14, 15 వార్డులలో వేర్వేరుగా ఇరువురు విస్తృతంగా పర్యటించారు. ఇంటింటికి వెళ్లి స్థానికుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. మంత్రి జోగి రమేష్ మాట్లాడుతూ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారం చేపట్టిన నాటి నుంచి ప్రజారంజకంగా పాలన చేస్తున్నారన్నారు. విద్యా, వైద్య రంగాలలో విప్లవాత్మక మార్పులు తీసుకువచ్చారని చెప్పారు. ప్రజా సంక్షేమ పథకాల అమలు విషయంలోను, వృద్ధులకు, దివ్యాంగులకు, వితంతువులకు, చేనేత, గీత కార్మికులకు ఇస్తున్న పింఛన్ల విషయంలోనూ ఇతర రాష్ట్రాలకు చెందిన వారు ఆదర్శంగా తీసుకుంటున్నారని తెలిపారు. ప్రజలకు ఇంత మంచి చేస్తున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి ఆశీర్వదించాలని కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ కటకం నాగకుమారి, వైస్ చైర్మన్లు ఎండీ ఖాజా, బైలపాటి జ్యోతి, ఫ్లోర్‌లీడర్ భళ్ల గంగయ్య, కౌన్సిలర్లు, వైఎస్సార్ సీపీ నాయకులు అబ్దుల్‌ఖాదర్ జిలానీ, బళ్ల సాంబశివరావు, మున్సిపల్ కమిషనర్ మహేంద్ర, తహసీల్దార్ మధుసూదనరావు, వివిధ శాఖల అధికారులు, నాయకులు, సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు పాల్గొన్నారు.

జగన్‌కు అండగా ఉండాలి..

ఇంటింటికీ తిరుగుతూ కరపత్రాలను అందజేస్తూ వారు పొందిన లబ్ధిని తెలియజేస్తూ జగనన్నకు మీరంతా అండగా ఉండాలని మంత్రి జోగి రమేష్ తనయుడు జోగి రాజీవ్ స్థానికులను కోరారు. 14, 15 వార్డులలో ఇంటింటికి తిరుగుతూ సీఎంగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అందించిన సంక్షేమ ఫలాలను వివరించారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి మీరంతా అండగా ఉండాలని కోరారు. మున్సిపల్ వైస్ చైర్మన్ ఎండీ ఖాజా, కౌన్సిలర్ శిరివెళ్ల జయేష్, బళ్ల సాంబశివరావు తదితరులు పాల్గొన్నారు.

వైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలి

బందరు ఎమ్మెల్యే పేర్ని నాని


వైద్యులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పేర్ని నాని. చిత్రంలో జేసీ అపరాజితసింగ్

మచిలీపట్నంటౌన్: రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరంలో భాగంగా నిర్వహిస్తున్న ఉచిత వైద్య శిబిరాలను నగర ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే పేర్ని వెంకట్రామయ్య (నాని) కోరారు. నగరంలోని 31వ డివిజన్ శారదానగర్‌లో నూతనంగా నిర్మించిన అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్ భవనాన్ని ప్రారంభించిన అనంతరం ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. వైద్యశిబిరంలో ఏర్పాటు చేసిన పలు విభాగాలను జాయింట్ కలెక్టర్ అపరాజితసింగ్‌తో కలిసి ఆయన పరిశీలించారు. అనంతరం జరిగిన సభలో పేర్ని నాని మాట్లాడుతూ నగరంలోని పేద ప్రజలకు ఉచిత వైద్యాన్ని చేరువ చేసేందుకు వైద్యశిబిరాలు ఎంతగానో ఉపయోగపడతాయని వివరించారు. మేయర్ చిటికిన వెంకటేశ్వరమ్మ, వైఎస్సార్ సీపీ యువజన విభాగం జోనల్ ఇన్‌చార్జి పేర్ని కిట్టు, వైఎస్సార్ సీపీ మైనార్టీ విభాగం జోనల్ ఇన్‌చార్జి షేక్ సలార్‌దాదా, అర్బన్ బ్యాంక్ మాజీ చైర్మన్ బొర్రా విఠల్, కార్పొరేటర్ యండ్రపాటి నాగేశ్వరరావు, శివగంగ పీఏసీఎస్ అధ్యక్షుడు కోసూరి మునలయ్య, స్పెషల్ పీపీ కొక్కిలిగడ్డ శరత్‌కుమార్, కార్పొరేటర్లు, నాయకులు పాల్గొన్నారు.

ప్రతి కుటుంబంలో సంక్షేమ వెలుగులు


వృద్ధురాలి సమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే సింహాద్రి

అవనిగడ్డ: సంక్షేమ కార్యక్రమాల ద్వారా ప్రతి కుటుంబానికి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి లబ్ధి చేకూరుస్తున్నారని ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు అన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం రామచంద్రపురం, వలందపాలెంలో మంగళవారం నిర్వహించారు. ఎమ్మెల్యే ఇంటింటికీ వెళ్లి స్థానికుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రతి పేదవాడికి విద్య, వైద్యం అందించడంతో పాటు ఆర్థికంగా ఎదిగేందుకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎన్నో పథకాలు అమలు చేస్తున్నారన్నారు. మరోసారి వైఎస్సార్ సీపీకి అధికారం ఇస్తే మరిన్ని సంక్షేమ పథకాలు అమలులోకి వస్తాయని వివరించారు. వైఎస్సార్ సీపీ యువనేత సింహాద్రి వికాస్, ఎంపీపీ తుంగల సుమతీదేవి, జెడ్పీటీసీ చింతలపూడి లక్ష్మీనారాయణ, సర్పంచ్ వాకా సుబ్రహ్మణ్యం, వైఎస్సార్ సీపీ నియోజకవర్గ అధికార ప్రతినిధి సింహాద్రి వెంకటేశ్వరరావు, రేపల్లె శ్రీనివాసరావు పాల్గొన్నారు.